క్లుప్తంగా

ప్రమాద బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ


గాయపడిన సాయిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

ఎస్.రాయవరం : మందుగుండు సామాగ్రిని వెలిగించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోకపోతే పెద్ద ప్రమాదాలకు దారితీస్తుందని పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. కొత్త అమావాస్య జాతర పురస్కరించుకుని మందుగుండు వెలిగించడంతో బొండా శ్రీనివాసరావు కుమారుడు సాయికి చేతికి గాయమైంది. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే పరామర్శించారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గాయపడిన సాయికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ పరామర్శలో ఎమ్మెల్యేతో పాటు గుడివాడ సర్పంచ్ దూళి శ్రీనుబాబు, ఎంపీటీసీ బొండా దివాణం, పోయిన నరేష్, కొరుప్రోలు పీఏసీఎస్ చైర్‌పర్సన్ చేకూరి శ్రీరామచంద్రరాజు, నాయకులు మందగుదుల వెంకటరమణ, జగదీష్, పోచిన నరేష్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పంచాంగ శ్రవణం


వెంకటాపురంలోని రామాలయంలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక : వెంకటాపురం రామాలయంలో మంగళవారం క్రోధి నామసంవత్సర ఉగాదిని పురస్కరించుకొని పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ ఏడాదిలో జరిగే రాశి ఫలాలు, గ్రామ దేవతల గ్రహ స్థితులు , ప్రకృతి వైపరీత్యాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ సుందరపు తాతాజీ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో సీతారాముల కల్యాణరాట


సీతారాముల రాటమహోత్సవంలో పాల్గొన్న భక్తులు

మునగపాక : పంచాయతీ వీధిలోని రామాలయం వద్ద మంగళవారం రాట మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేప చెట్టుకు పసుపు, కుంకుమ అద్ది మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 17న జరగనున్న శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా గ్రామస్తులంతా రాటమహోత్సవంలో పాల్గొన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ, పెద్దలు ఆడారి లక్ష్మణరావు, ఆడారి కాశీబాబు, జల్లేపల్లి కిష్టప్ప, పొలిమేర కృష్ణ,బొడ్డేడ రామారావు,వెలగా శ్రీనివాసరావు, ఆడారి సూరిబాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తూర్పుకాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా రామునాయుడు

యలమంచిలి : మండల తూర్పుకాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఏటికొప్పాక గ్రామానికి చెందిన శెన్నెంశెట్టి రామునాయుడును నియమించినట్టు జిల్లా తూర్పు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు కరణం శ్రీహరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యలమంచిలి మండలం ప్రధాన కార్యదర్శిగా ఆడపా దేముళ్లు, ఉపాధ్యక్షులుగా శానాపతి త్రినాథ్‌ను నియమించినట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా తూర్పు కాపు కోర్ కమిటీ సభ్యులు నక్కా శివశంకర్, అడపా శేషగిరి, అన్నం స్వరాజ్యరావు, ఆకుల వెంకటేష్, నగిరెడ్డి అచ్చియ్యనాయుడు తదితరులు పాల్గొన్నట్టు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యం కావాలి

మునగపాక : రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం కోసం కష్టపడి పనిచేయాలని తిమ్మరాజుపేట మాజీ సర్పంచ్ శరగడం జగన్నాథరావు కోరారు. తిమ్మరాజుపేట పార్టీ కార్యాలయంలో మంగళవారం రాత్రి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, యు.వి.రమణమూర్తిరాజులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. బీసీ సెల్ మండల అధ్యక్షుడు కాండ్రేగుల జగన్, పార్టీ నేతలు గణేష్, జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.


అభయాంజనేయస్వామి ఆలయంలో తాపీ మేస్త్రీల పూజలు


దిమిలి రోడ్డు కూడలిలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న రంగా వెంకటస్వామి ట్రస్టు ప్రతినిధులు


ఏటికొప్పాక వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తుల పూజలు

ఉగాది వేళ..ఉత్సవ శోభ

- భక్తిశ్రద్ధలతో క్రోధినామ సంవత్సర ఉగాది వేడుకలు
- ఆలయాలకు భక్తుల తాకిడి
- వేద పండితుల పంచాంగ పఠనం


అరబుపాలెంలో ముసిలితల్లి అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు


దిమిలిలో చారిత్రక నగ్నేశ్వరస్వామికి పూజలు

యలమంచిలి రూరల్ : శ్రీ క్రోధినామ తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని యలమంచిలి పట్టణం, మండలంలో ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పండగ వైభవం ఉట్టిపడేలా హిందువులంతా సంప్రదాయ దుస్తులు ధరించి ఇంటి గుమ్మాలను మామిడి తోరణాలు,పూలతో అలంకరించారు. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడి, పిండి వంటలు తయారు చేసి ఇష్టదేవుళ్లకు నైవేద్యంగా సమర్పించి ఆరగించారు. ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. యలమంచిలి పట్టణంలోని బస్టాండు పక్కనున్న ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఏటికొప్పాక పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రధాన అర్చకుడు నేమాని సత్య వెంకట నాగ మాధవరావు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సన్యాసమ్మ చెరువు పక్కనున్న అభయాంజనేయ స్వామి ఆలయంలో తాపీ మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. ఆలయాల్లో వేద పండితులు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు.

7వేల మందికి ఉగాది పచ్చడి వితరణ

దిమిలి రోడ్డు కూడలి, ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద రంగా చినవెంకటస్వామి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో 7 వేల మందికి ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. 2001 నుంచి ఈ కార్యక్రమం నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నామని ట్రస్టు ప్రతినిధులు రంగా చినవెంకటస్వామి (పెద్ద), రంగా నూకరాజు, రంగా గున్నయ్య (రవి),రంగా సునీత తెలిపారు.

రాంబిల్లి: మండలవ్యాప్తంగా మంగళవారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. దిమిలిలో చారిత్రక నగ్నేశ్వరస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీదేవి, భూదేవి సమేత వల్లభనారాయణస్వామిని భక్తులు దర్శించుకున్నారు. పలు చోట్ల ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. పంచాంగ శ్రవణ కార్యక్రమాలను నిర్వహించారు. రైతులు ఏరువాక పనులను ప్రారంభించారు.

కోటవురట్ల: మండలంలో కొత్త సంవత్సరాది శుభాకాంక్షలు తెలుపుకుంటూ ప్రజలు ఉగాది పచ్చడి సేవించారు. ఆలయాలలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఏడాదంతా మంచి జరగాలని కోరుకుంటూ ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు.

మునగపాక: మండల వ్యాప్తంగా మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. అరబుపాలెంలో ముసిలితల్లి అమ్మవారిని ఎమ్మెల్యే రమణమూరితాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ దర్శించుకున్నారు. సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు,ఎంపీటీసీ బొడ్డేడ హైమావతి పాల్గొన్నారు మునగపాక మెయిన్‌రోడ్డులో లింగరాయి గుడిలో ఉగాది సందర్భంగా ఆలయ పురోహితులు సోమేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ భవనంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.


యల్లారమ్మజాతరలో జన సందడి


కొండకర్ల యల్లారమ్మ జాతరలో భాగంగా ఏర్పాటు చేసిన సెట్టింగ్‌లు

ఘనంగా యల్లారమ్మ జాతర

అచ్యుతాపురం: అచ్యుతాపురం మండలంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పలు ఆలయాల్లో పంచాగ శ్రవణం,ఉగాది పచ్చడి వితరణ కార్యక్రమం చేపట్టారు. అదేవిధంగా మూడు రోజుల పాటు నిర్వహించే కొండకర్ల యల్లారమ్మ పేరంటాలు జాతర మంగళవారం మొదలైంది. పలు కూడళ్లలో సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు.పలువురు ప్రజా ప్రతినిధులు యల్లారమ్మను దర్శించుకొని పూజలు చేశారు.

ఉగాది వేళ.. శుభాకాంక్షల వెల్లువ


ఎమ్మెల్యేకు ఉగాది శుభాకాంక్షలు చెబుతున్న మండల నాయకులు

ఎస్.రాయవరం : పాయకరావుపేట నియోజకవర్గవర్గ ప్రజలకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అడ్డురోడ్డు క్యాంపు కార్యాల యం వద్ద ఎమ్మెల్యేను పలువురు కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీ క్రోధినామ సంవత్సరంలో అందరూ సుఖశాంతులతో మెలగాలని వ్యాపార, వ్యవసాయ రంగా మంచి ఫలితాలు సాధించి, ఉద్యోగ ప్రయత్నాలు ఫలించి, విద్యార్థులు మంచి ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు,సర్పంచ్‌లు దూళి శ్రీనుబాబు, కర్రి సత్యనారాయణ, ఎంపీటీసీలు చొప్పా రాజు,బొండా దివాణం, నాయకులు మందగుదుల వెంకటరమణ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

భావనారుషేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

రాంబిల్లి : కొత్తపేట గ్రామంలో భద్రావతి సమేత భావనారుషేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పత్రి పూజ నిర్వహించారు. బుధవారం కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అన్న సమారాధన, పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

వైభవంగా అభయాంజనేయస్వామి తీర్థం


స్వామిని దర్శించుకుంటున్న విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్, తాపీ మేస్త్రీల సంఘం సభ్యులు


ఆలయం వద్ద మహిళల కోలాటం

యలమంచిలి : ఉగాది పర్వదినం సందర్భంగా పట్టణంలో ద్వారకానగర్‌లో అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. ప్రతి ఏటా ఉగాదికి స్థానిక ద్వారకానగర్ పాత జాతీయ రహదారి పక్కన ఉన్న అభయాంజనేయస్వామి వారి తీర్థ మహోత్సవాన్ని యలమంచిలి తాపీ మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. సాయంత్రం స్వామివారి ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులందరికీ తాపీ మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో అన్న ప్రసాదాలు అందజేశారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ స్వామివారిని దర్శించుకున్నారు. తాపీ మేస్త్రీల సంఘం సభ్యులు ఆడారి శంకరరావు, మళ్ల జయరాం, గుర్రాల రామలక్ష్మణ, సూరిశెట్టి గణేష్, కాండ్రేగుల సూరిబాబు, యల్లపు గోవింద్, వియ్యపు సోమినాయుడు,వియ్యపు చిరంజీవి పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్ : అభయాంజనేయస్వామి తీర్థం సందర్భంగా మంగళవారం సాయంత్రం మహిళల కోలాటాలు, చెక్క భజనలు,పిల్లల నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఆలయ పరిసరాల్లో విద్యుదలంకరణ ఏర్పాటు చేశారు. స్వామి విగ్రహాన్ని తమలపాకులు, నిమ్మకాయలు, అప్పాల దండలతో అలంకరించారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామికి లక్ష మల్లెల పూజ

ఎస్.రాయవరం : దార్లపూడి కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం లక్ష మల్లెల పూజ నిర్వహించారు. ఉగాది పర్వదినం పురస్కరించుకుని ప్రతిఏడాది ఉత్సవ మూర్తులకు లక్ష మల్లెలు సమకూర్చి సాయంత్రం నుంచి వేదపండితులు ఆధ్వర్యంలో పూజ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. స్థానిక భక్తులు మల్లెలు సేకరించి అంగరంగ వైభవంగా పూజ నిర్వహించారు. కార్యక్రమంలో దార్లపూడి, ఏటి కొప్పాక, చినగుమ్ములూరు, పందూరు, రామచంద్రపురం, పీఎస్‌ఆర్ పేట నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


లక్ష మల్లెల పూజలందుకున్న కల్యాణ వెంకన్నస్వామి

సమష్టి కృషితో భారీ మెజార్టీ సాధించాలి

- తంగేడు రాజులతో ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు భేటీ


తంగేడు రాజులతో ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే జోగులు

కోటవురట్ల : నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి భారీ మెజారిటీ వచ్చేందుకు తంగేడు రాజుల కృషి ఎంతైనా అవసరమని పాయకరావుపేట నియోజవకర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. తంగేడులోని రాజకుటుంబీకులను మంగళవారం ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వారిని పరిచయం చేసుకుని పార్టీ అంశాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. కోటవురట్ల మండలం ఎపుడూ వైఎస్సార్‌సీపీకి కంచుకోటగానే ఉందని, ఈసారి కూడా అత్యధిక మెజారిటీ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతి ఓటు ఎంతో విలువైనదని అందరినీ కలుపుకొని సమష్టిగా విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఎంఈ చైర్మన్ డి.వి.సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్ సీతారామరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆర్.ఎస్ రామచంద్రరాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, సర్పంచ్ అనిల్‌కుమార్, ఉప సర్పంచ్ లక్ష్మీ నరసింహరాజు, పార్టీ నాయకులు సత్యనారాయణరాజు, ప్రవీణ్‌బాబు, రమణ పాల్గొన్నారు.

మత్స్యకార గ్రామంలో రెండు పూరిళ్లు దగ్ధం

ఎస్.రాయవరం : మత్స్యకార గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమై మారు రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు చెబుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం పూరింటికి నిప్పంటుకుని అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో ఉమ్మిడి కాశి,గోవిందు, చోడిపల్లి రాజమ్మలకు చెందిన ఇళ్లు కాలిబూడిదయ్యాయి. వీరందరికీ చేపల వేట, చేపల వ్యాపారం జీవనాధారం. అగ్ని ప్రమాదంలో ఇంట్లో వస్తువులతో పాటు వలలు, చేపల నిల్వ బాక్సులు పూర్తిగా కాలిపోయినట్టు చెబుతున్నారు. ప్రమాదంపై నక్కపల్లి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించినా అప్పటికే ఇళ్లు పూర్తిగా కాలిపోయినట్టు చెప్పారు. స్థానిక రెవెన్యూ సిబ్బంది బాధితులకు జరిగిన నష్టం వివరాలు నమోదు చేసుకుని తక్షణ సహాయం అందించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు.


అగ్నిప్రమాదంలో కాలిబూడిదైన పూరిళ్లు

మరోసారి ఆశీర్వదించండి

- నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా
- ఏటికొప్పాకలో ఎన్నికల ప్రచారం ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నబాబురాజు
- కూటమితో ఒరిగేదేమీ లేదన్న బొడ్డేడ ప్రసాద్
- స్థానిక మహిళలు, యువకుల నుంచి అనూహ్య స్పందన


ఏటికొప్పాకలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, పార్టీ శ్రేణులు


ఫ్యాన్ గుర్తు చూపుతూ వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

యలమంచిలి రూరల్ : మరొక్కసారి ఆశీర్వదించండి.. యలమంచిలి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పలపాటి వెంకట రమణమూర్తి రాజు(కన్నబాబు) స్పష్టం చేశారు. ఏటికొప్పాకలో ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఆనవాయితీ ప్రకారం ముందుగా గ్రామంలోని బండిమాంబ అమ్మవారిని దర్శించుకుని,పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలిసి తనకు మరోసారి ఓటు వేసి అవకాశం కల్పించాలని అభ్యర్థించారు. గ్రామంలో సంతబయలు వద్ద ప్రచార రథంపై నుంచి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఐదేళ్లలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలంతా గుర్తుంచుకుని పేదలకు మేలు చేసే ఈ ప్రభుత్వానికే మళ్లీ మద్దతునివ్వాలని కోరారు. రాష్ట్రంలో కూటమి పేరుతో ప్రజల వద్దకొస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీలను ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. 2014లో ఇదే కూటమి ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన అనేక హామీలను అమలు చేయకుండా మోసగించిన పరిస్థితిని మర్చిపోవద్దన్నారు. మళ్లీ కూటమి పేరుతో ప్రజలను మోసం చేయడానికి ఆచరణ సాధ్యం కాని హామీలను ఇస్తున్నారని ఆరోపించారు. తనను మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన యలమంచిలి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడానికి మరోసారి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ గతంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు రైతు రుణ మాఫీ,మహిళల బంగారు రుణాల మాఫీ చేయకుండా మోసగించారన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని జాబు రావాలంటే బాబు రావాలంటూ ప్రజలను నమ్మించి, ఓట్లు వేయించుకుని అందర్నీ నిలువునా మోసగించారన్నారు. 2019 ఎన్నికల ముందు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 96 శాతం నెరవేర్చారని గుర్తు చేశారు. గ్రామాల్లో సచివాలయ వ్యవస్థను నెలకొల్పి పరిపాలనా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం, బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. ప్రతి కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకూ లబ్ధి చేకూర్చిన ప్రభుత్వానికి అందరూ మద్దతునివ్వాలన్నారు. ఎమ్మెల్యేగా కన్నబాబు, ఎంపీగా బూడి ముత్యాలనాయుడిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. స్థానిక మహిళలు,యువకుల నుంచి ప్రచారానికి అనూహ్యమైన స్పందన లభించింది. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి, సేనాపతి రాము, ఎంపీపీ బోదెపు గోవింద్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, చింతలపాటి రాజాబాబు, చింతలపాటి ప్రతాప్‌బాబు, రాజాన శేషు, మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వర్రావు, దూది నర్సింహమూర్తి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, కర్రి శివ, పసగడుగుల రమేష్, కాళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.


బండిమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు

ఆలయాల వద్ద ఉగాది పచ్చడి పంపిణీ


ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట : కుమారపురం గ్రామంలో దాన ధర్మం చారిటబుల్ ట్రస్ట్, సనాతన ధర్మ మేథో వేదిక సహాయ సహకారాలతో గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయం, సీతారామాలయం, ఎర్ర మార్కమ్మ అమ్మవారి దేవాలయం, శ్రీసిద్ధి గణపతి దేవాలయం, పెద్దూరు కోదండ రామాలయం వద్ద సుమారు 500 మందికి ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

సమాజ సేవకుల నుంచి యువత స్ఫూర్తి పొందాలి

ఎస్.రాయవరం : సమాజంలో వివిధ సేవలు అందించి ప్రత్యేక గుర్తింపు కలిగిన వ్యక్తులను యువత స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని ప్రముఖ న్యాయవాది యర్రా లత్సన్న అన్నారు. కొరుప్రోలు గ్రామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పలువురు ప్రముఖులను ఘనంగా సత్కరించారు. ఇటీవల పద్మశ్రీ అవార్డు అందుకున్న ఏటికొప్పాక లక్కబొమ్మల తయారీదారు చింతలపాటి వెంకటపతిరాజు, కొరుప్రోలు గ్రామంలో 35 ఏళ్ల పాటు సర్పంచ్‌గా సేవలందించిన ప్రత్తిపాటి సూర్యారావు, ఏటికొప్పాక సుగర్‌ఫ్యాక్టరీ ఉద్యోగి అంగిరెడ్డి సుబ్బారావు, విశ్రాంత ఉపాధ్యాయులు బొడ్డా చిట్టిబాబు, కొరుప్రోలు అయుర్వేద వైద్యులు సుజాత, వింజమూరి సోమసుందర శర్మ తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పుట్టా సుధాకర్, కొరుప్రోలు పీఏసీఎస్ చైర్‌పర్సన్ చేకూరి శ్రీరామచంద్రరాజు, వైస్ ప్రెసిడెంట్ కొరపాటి గోపాలం, గ్రామపెద్దలు కోరా రామారావు, ప్రతిపాటి సత్తిరాజు పాల్గొన్నారు.


కొరుప్రోలులో పద్మశ్రీ అవార్డు గ్రహీతతో పాటు, ప్రముఖులను సత్కరించిన గ్రామస్తులు

సీతారాములను దర్శించుకున్న కంబాల జోగులు


సీతారాములను దర్శించుకుంటున్న కంబాల జోగులు, చిక్కాల రామారావు

పాయకరావుపేట : పట్టణంలో మంగళవారం సాయంత్రం జరిగిన పేరంటాలమ్మ తీర్థం సందర్భంగా నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు సీతారాములను దర్శించుకున్నారు. ఉగాది నాడు ప్రతి సంవత్సరం పేరంటాలమ్మ (చిలకల) తీర్థం ఘనంగా జరుగుతుంది. ఈ తీర్థానికి చుట్టు పక్కల 4 గ్రామాల నుంచి భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు పేరంటాలమ్మ తీర్థాన్ని కాలినడకన వెళ్లి తిలకిస్తూ, పేరంటాలమ్మ అమ్మవారిని, గుడి పక్కన వున్న శ్రీ సీతారాములను దర్శించుకున్నారు. కంబాల జోగులుతో పాటు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, ఆలయ అభివృద్ధి కమిటీ, వానరసేన సభ్యులు పాల్గొన్నారు.

సమైక్యతను చాటేలా గ్రామదేవతల పండగలు


చిన్నారుల కోలాటం

కోటవురట్ల : గ్రామ దేవతల పండుగలు సమైక్యతను చాటుతాయని పాయకరావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. స్థానిక పేటలో మహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. అనంతరం స్థానికులతో ముచ్చటించారు. ఆలయాల సందర్శన మంచిని, సన్మార్గాన్ని కలిగిస్తాయన్నారు. పండగలు గ్రామ కట్టుబాట్లకు నిదర్శనంగా నిలుస్తాయన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది. ఎంఎస్‌ఎంఈ చైర్మన్ డి.వి.సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్ సీతారామరాజు, సర్పంచ్ అనిల్‌కుమార్, ఎంపీటీసీ రాంబాబు, ఉప సర్పంచ్ గవ్వా రాధాకృష్ణ, పార్టీ నాయకులు ఆర్‌ఎస్ నారాయణమూర్తిరాజు, గవ్వా చిట్టిబాబు పాల్గొన్నారు.